# మనుషులింకా మారలేదు



— విమలారామం

నా పెళ్ళికి ఎవరొచ్చినా రాకపోయినా 'రేణు' తప్పకుండా వస్తుందనుకున్నాను.

పెళ్ళిపందిట్లో నా ప్రవర్తన చూసి నలుగురూ నవ్వుకున్నారేమో కూడా! అక్కయ్య నా చెవిలో ఓసారి చెప్పనూ చెప్పింది— 'కొంచెం తలదించుకోవే తల్లీ!' అని. ఇంకా ఫలితం లేకపోతే నా తలమీద చెయ్యివేసి వంచినంత పనిచేసింది వదిన!

'రేణు' కోసం నాకళ్ళు మాటిమాటికీ నలువైపులకీ తిరగటమే దీనికంతకీ కారణం:

ముహూర్తం దగ్గర పడింది. ఆశ తరిగిన కొద్దీ....ఆరాటం పెరిగిపోయింది. 'రేణు' వచ్చినట్టు లేదు!

జీలకర్ర, బెల్లం తలమీద పెట్టించారు. అక్షింతలు మీద కురిసాయి. క్రొత్త జీవితంలోకి అడుగుపెట్టే క్షణంలో ఒళ్ళు పులకరించింది.

అదికూడా కొద్దిక్షణాలే! మళ్ళీ నా చూపులు కలయ దిరిగాయి— రేణుకోసం! అక్కయ్య నడిగాను



వచ్చిందేమో చూడమని। .... ఒక్కసారి కాదు పదిసార్లు।

సూత్రధారణ వేళకయినా వస్తుందేమో అన్న ఆశ మినుకు మినుకు మంది.

మంగళ వాయిద్యాలు మ్రోగుతున్నాయి. అక్క జడ ఎత్తి పట్టుకుంది. ఆయన చేతి వ్రేళ్లు మెడమీద మూడుసార్లు కితకితలు పెట్టాయి। ఒక్కసారి ఒళ్ళు ఝల్లుమంది.

తలంబ్రాల సమయానికి కాదు కదా-విడిదిలో గృహ ప్రవేశం చేసే వేళకయినా 'రేణు' రాలేదు. ఇంక వస్తుందన్న ఆశమిగల్లేదు.... అప్పుడు వచ్చినా చూడవల్సిన ముచ్చట్లేం మిగిలాయి కనుక।

నాలోని నిరుత్సాహం .... నాముఖంలో కనిపించే ఉంటుంది। నలుగురూ నానా రకాలుగా అనుకొనే ఉంటారు!

అదేం పట్టించుకొనే స్థితిలో లేను నేను. దీనికంతకీ కారణం

'రేణూ' రాకపోవటం!

అందువల్లనే. ఆవేళ మధ్యాహ్నం తమ్ముడు ఇంత 'గ్రీటింగ్సు' కట్ట పట్టుకు వచ్చి నాముందు పడేసినప్పుడు....అవి చదవాలన్న ఆసక్తి కూడా లేక పోయింది. నన్నేదో విధంగా పలకరిస్తూ నా ప్రక్కనే కూర్చున్న మా ఆడపడుచు....ఒక్కొక్క కవరే విప్పి గ్రీటింగ్సు పంపిన వాళ్ళ పేర్లు-చదవసాగింది .... ఆమె నోటి వెంట 'రేణుక' అన్న పేరు విన్న వెంటనే - నిద్దట్లోంచి ఉలిక్కి-పడినట్లయ్యాను,

'రేణూ' ఎదురుగా కూర్చున్నంత ఉత్సాహంతో ఆ గ్రీటింగ్సు అందుకొని పదేపదే చదివాను. నా హడావిడికి—మా ఆడపడుచు చిత్రంగా చూసింది! 'పోనీలే—గ్రీటింగ్సయినా పంపింది' అని అప్పటికి సరిపెట్టుకున్నాను.

ఆ తర్వాత-'మరయితే ఎందుకు రాలేదూ?' అన్న ప్రశ్న ఉదయించింది. దానికి జవాబు - మనుగుడు పులకని - తిరిగి శ్రీవారితో వెనక్కి-వచ్చాక కాని నాకు దొరక లేదు!

రేణూ వ్రాసిన ఉత్తరం అమ్మ ఇచ్చింది. ఆత్రంగా కవరుచించి చదివాను. అంత పెద్ద కవరులో చిన్న కాగితం మడత, దాంట్లో రెండే రెండు ముక్కలు.

"ఒంట్లో బాగుండని కారణంగా రాలేక పోతున్నాను! మరొకలా అనుకోకు....ఎప్పటికీ నీ క్షేమం కోరే—నీ రేణు."

అంతేనా? 'రేణూ' నన్నింతగా ఎప్పుడూ నిరుత్సాహ పరచలేదు. కనీసం....త్వరలో వస్తానని కానీ-ఎప్పుడు రమ్మంటావని కానీ-వ్రాసి ఉంటే నాకింత మనస్సు చివుక్కు-మనేది కాదు! "అంత చూడాలన్న ఆసక్తే దానికి లేనప్పుడు - నేనెందుకింత బాధపడటం?...." నిజంగా నాకు 'రేణూ'మీద కోపం వచ్చింది!

ఆవేళ మధ్యాహ్నం భోజనాలయ్యాక శ్రీవారిని- నన్నూ ఒంటరిగా గదిలో వదిలేసి అంతా తలో మూలకి పోయారు!

"ఏమిటబ్బా అంత సీరియస్‌గా ఆలోచిస్తున్నావు?" అని దగ్గరికి లాక్కున్నారు ఆయన,

"ఊఁ! పట్టపగలు....ఏమిటిది?" అని గింజుకున్నాను.

"నిన్ను నాకప్పగించి అంతా వెళ్ళిపోయారు -కనుక ఇది పగలా రాత్రా అన్న ప్రశక్తి అనవసరం! మర్యాదగా రా! లేకపోతే...."

"ఊఁ! లేకపోతే?"

"ఏం చేస్తానో నాకే తెలియదు, ఏదోటి మాత్రం చేసేస్తాను."

"అబ్బ. మీరింత అల్లరి వారనుకోలేదు!"

"ఏమో? నాకేం తెల్సు?....ఈ నాల్గు రోజుల్నించీ నువ్వివ్వచ్చిన

ట్రయినింగే!"

"ఛ! పొండీ?"

"బాబోయ్! నిన్నువదలి వెళ్ళాలంటే నాకు భయం!" అంటూ కొంటెగా నా పమిటచెంగు ముఖం మీదకి కప్పుకున్నారాయన.

నేను పొందిన భాగ్యాన్ని నా ప్రాణ స్నేహితురాలు కళ్ళారా చూడలేదన్న ఉక్రోషం...నన్నింకా పట్టి విడువలేదు!....

"అబ్బ! ఏమిటా పరధ్యాహ్నం!...."

"ఏమీ లేదు!"

"అంటే ఏదో ఉందనే అర్థం!...."

"ఉందీ అంటే ఉంది. లేదూ అంటే లేదు...."

"ఆహా! నువ్వు గమ్మత్తుగా మాట్లాడుతావే!"

"అంటే! ఇంకా అలామాట్లాడే వాళ్ళెవరో ఉన్నారన్నమాట! ఎవరు చెప్మా?"-శ్రీవారి ముఖం చూసేసరికి నవ్వు వచ్చింది.

నాబుగ్గలో పొడిచి "....ఉన్నా. నేను చెప్తానేమిటి?" అన్నారు.

నేను మూతి ముడిచాను. "చెప్పకపోతే దాచుకోండి. నాకేం"

"....నువ్వు చెప్తానన్నది చెప్పలేదు. మాట దాటేస్తున్నావు!"

"నేను కాదు దాటేసింది ....నా ఫ్రెండు! దుర్మార్గురాలు- మోసం చేసింది."

ఆయన చిత్రంగా చూసారు...

"మోసమా? ఏం చేసింది?"

"ఇంకేం చేయాలి? మన పెళ్ళికి వస్తాను-అంటూ ఎన్నో ఉత్తరాలు వ్రాసి తీరా సమయానికి వచ్చింది కాదు....చూడండీ ఉత్తరం!"

అది చదివి చిత్రంగా చూసారాయన.

"ఏమిటంత సేపు చూస్తున్నారు"

"అబ్బే.ఏం లేదు! ఈ రైటింగ్ ఎక్కడో చూచినట్టుంటేను...."

"బావుంది. రేణుని ఎప్పుడూ చూసుండరు. ఇంక దాని రైటింగ్ ఎలా చూసుంటారు?"

"రేణా!- రేణూ అంటే?"

"రేణూ- ముద్దుపేరు. అసలు పేరు రేణుక!"

"ఇప్పుడెక్కడుంది?"

"వరంగల్లులో ఆంధ్రా బ్యాంకులో పనిచేస్తోంది."

చటుక్కున ఉత్తరం నాకిచ్చేసి "....కొంచెం మంచినీళ్ళు తెచ్చిపెట్టు" అన్నారాయన.

తెచ్చిచ్చాను. పెట్టెలోనుంచి నా ఆల్బమ్ బయటకు తీసాను. ఆయనకు ఫోటోలన్నీ చూపిస్తూ....వివరాలు చెప్పనారంభించాను.

"....ఇదే రేణుక! అది ఉద్యోగానికి వెళ్ళబోయేముందు తీయించుకున్నాం...."

ఆ ఫోటోని ఆయన కనురెప్ప వేయకుండా చూడసాగారు.

"ఈ పిల్లకన్న ముందు ఆ పిల్లని చూసుంటే బాగుండిపోయేదని అనుకుంటున్నారు కదూ!" అని నవ్వాను.

ఆల్బమ్ నా చేతుల్లో పెట్టేసి 'ఛ! పో!' అన్నారాయన.

ఆయన ముఖం చూసేసరికి నాకు నవ్వాగలేదు. "అలాగయినా మీకు వీలయ్యేది కాదు లెండి."

ఏమిటన్నట్టు చూసారాయన.

"రేణూకి సంబంధం ఎప్పుడో సెటిల్ అయింది. ఏమిటలా చూస్తారు? దానికేం లోటని! అంద చందాలున్నాయి. చక్కని ఉద్యోగం చేస్తోంది.... అతనిక్కూడా అదే బ్యాంకులో ఉద్యోగం! .... చిత్రమేమంటే దానిక్కాబోయే భర్త పేరు కూడా మీ పేరే!"

ఆయన నావైపే కళ్ళప్పగించి చూస్తున్నారు.

"....నిజం! మీరా వేళ పెళ్లి చూపులకి వచ్చినప్పుడు నా కనిపించింది అదే! మేమిద్దరం ఆదర్శవంతులయిన భర్తల్ని చేసుకోవాలని మనసుపడేవాళ్ళం! మా అదృష్టం.... మాకు మీరు దొరకటమే కాదు.... మీ పేర్లు కూడా ఒకటే అయ్యాయి. ఎటోచ్చీ మీ ఆదర్శాల్లో మాత్రమే ఆ తేడా! మీరు కట్నంలేకుండా నన్ను పెళ్లాడారు. ....మరో ఆదర్శంతో అతను రేణూని పెళ్ళాడబోతున్నాడు. .... అన్నట్టు నేను వివరాలు చెప్పలేదు కదూ! పాపం, రేణు వాళ్ళక్కకి పెళ్ళయిన ఆరు నెల్లకే— జబ్బుచేసి భర్త పోయాడు. అప్పటి కావిడ పెద్దగా చదువుకోలేదు. చాలా చిన్న వయసు. ఇక ఆవిడకు ఒంటరితనపు బ్రతుకు రాసిపెట్టి నట్టు-తప్పదన్నట్టు పెద్దవాళ్ళు మళ్ళీ పెళ్ళిమాట ఎత్తకుండా చదువులో పెట్టారు. పట్టుదలగా చదివి ఆవిడ బియ్యే పాసయింది. బి. యి. డి. ట్రయినింగు అయి టీచరు ఉద్యోగం చేయటం మొదలు పెట్టింది. ఆ తర్వాత రెండేళ్ళకి హఠాత్తుగా వాళ్ళ వాళ్ళెవ్వరూ ఊహించని పనిచేసింది ఆవిడ!"

"ఏం చేసింది?"

"....తన కో టీచర్ని పెళ్ళి చేసుకుంది. నల్గురూ నానావిధాలుగా నిందలు వేసారు! ఇలాంటి వాటికి సిద్ధపడే ఆ పెళ్ళి చేసుకున్నారు కనుక వాళ్ళు లెక్కచేయలేదు. వాళ్ళ జీవితం ఆ తర్వాత హాయిగానే ఉంది. కాని,........అదే రేణుక పాలిట శాపం అవుతుందని ఎవ్వరూ అనుకోలేదు...." అని ఆగి ఆయన వైపో క్షణం చూసాను.

ఆయన నా మాటలు వింటున్నారో లేదో - ఆ ముఖం చూస్తే అర్థంకాలేదు. "వింటున్నారా?" అన్నాను.

ఆయన తల వూపారు.

"....తల్లి దండ్రులు మారు

తున్న కాలాన్ని గుర్తించలేదు. ఏనాటికయినా వాళ్ళ మనస్సు మార్చుకొని మోడయిపోయిన తన జీవితాన్ని చిగిరించేలా చేస్తారేమో నని ఆవిడ ఎదురు చూపింది.... వాళ్ళు ప్రయత్నం చేయలేదు. అసలు చేసే ఉద్దేశ్యమే వాళ్ళకు లేదు.... అటువంటి అవకాశం కోరుకోకుండానే ఆవిడకు వచ్చింది. మనసున్న మంచిమనిషి దొరికాడు. తన జీవితం చక్క బరచుకుంది... కాని, రేణూ వాళ్ళ కుటుంబానికదో మచ్చ అయిపోయింది, అయినా కాకపోయినా అయినట్లు వాళ్ళుపెద్ద చేసి చెప్పుకున్నారు, అందువల్లనే దానికి పెళ్ళి సంబంధాలే రాకుండా పోయాయి.... ఇన్నాళ్ళకి.... అదిగో మీ పేరింటాయన పెళ్ళికొప్పుకు న్నారు!.... దేశం గొడ్డుపోలేదు. మీలాంటి ఆదర్శ పురుషులున్నారు! మా అదృష్టంకొద్దీ.... వెతుక్కో వాలి కాని.... ఉంటున్నారు!" గుండె నిండిన ఆనందంతో ఆయన చేతులు పట్టుకున్నాను.

ఆయన ముఖం ఎర్రపడిపోయి వింతగా కనిపించింది. ఆయన దృష్టి ఎటో ఉంది.

"మీకో గమ్మత్తు చెప్పనా!"

తల త్రిప్పకుండానే అడిగారు.

"ఏమిటీ?"

"మేము కాలేజీలో చదివే టప్పుడు—మా కిద్దరికీ పోటీలమీద ప్రేమలేఖలు వచ్చేవి!"

ఎందుకో ఆయన నవ్వులో ఆశించినంతతళుకు లేదు, అసూయా? నాకర్థం కాలేదు.

"చిత్రమేమంటే రేణూ ఉద్యోగంలో చేరినా దానికి ప్రేమలేఖలు రావటం మానలేదు! నిజం! మీరే రేణూని చూసి ఉంటే...."

చురుక్కున చూసారాయన.

".... తప్పకుండా మీరూ ఒక ప్రేమలేఖ వ్రాసుండేవారు తెలుసా!" అని పకపక నవ్వాను,

ఆయన ముఖం ఎర్రపడింది. నొసలు చిట్లించి "ఊఁ! చాల్లే" అన్నారు.

"నిజమండీ! కాలేజీలో చదివే టప్పుడు-ప్రేమించా మంటూ ఉత్తరాలు వచ్చేవి. మరి ఉద్యోగాలు చేస్తూ బుద్ధిమంతు లనిపించుకుందా మనేమో - పెళ్ళి చేసుకుంటామని వ్రాస్తూ వచ్చారు. అంతే తేడా!"

ఆయన దృష్టి నా ముఖంమీద లేదు. అయినా నేను చెప్పుకు పోతూనే ఉన్నాను. "ముందు పెళ్ళాడతానన్న వాళ్ళే తీరా వాళ్ళ కథ విన్నాక వెనక్కి తగ్గిపోయే వాళ్ళు ఆఖరికి. ఆయన .... అదే మీపేరింటాయన ఒక్కడు మాత్రం నిలబడ్డాడు!..ఏమిటలా చూస్తారు?"

"అబ్బే. ఏం లేదు!"

"రేణూ ఏమనేదో తెల్సా?.... నా పెళ్ళికి రావే-అక్కడ నిన్నె

వరో చూసి మోహిస్తారు. ఆ వెంటనే నీ పెళ్ళి అయిపోతుంది- అని. చిత్రం! ఎప్పుడో అనుకున్నది దాని దవలేదు. అనుకోకుండా నా పెళ్ళి....అదే - మన పెళ్ళి ఇలా క్షణాలమీద జరిగిపోయింది!"

ఆయనోసారి నావైపు చూసి వెనక్కి తలగడ మీదకి వాలిపో యారు.

"....నెలక్రితం మీ రెవరో.... నే నెవరో.... చూడండి! జీవితం ఎంత చిత్రమయిందో! కట్నం లేకుండా మీరు పెళ్ళికి సిద్ధపడ్డం మూలానే మా వాళ్లింత త్వరగా ఈ పెళ్ళి చేయగలిగారు! నిజంగా మీలాంటి వాళ్లు మరికొంద రుంటే...."

"ఊఁ! విద్రొస్తోంది ...." అంటూ ఆయన తలగడలో తల దూర్చారు.

రేణూ గురించి-మా స్నేహం గురించి ఇంకా ఎన్నో కబుర్లు చెప్పాలన్న నా ఉత్సాహం చల్లగా చల్లారి పోయింది.

నా పొగడ్తలు కిట్టక సంభాష ణకి పుల్‌స్టాప్ పెట్టారేమో అను కున్నాను!

* * *

రేణూ!

ఈ మాటు నీ పేరుకు ముందు 'ప్రియ' అని నాకు చేర్చాలని పించటంలేదు.

ఎందుకంటె, నాకు నువ్వు 'ప్రీతికర' మైన దానివయినంత మాత్రాన సరిపోదు.

నువ్వు వీధిలోనే నిలబెట్టి....నన్ను చీదరించుకున్నా నిన్ను చూడ్డానికి ఆయనతోసహా వస్తాను. నీమౌనం కన్న....ఆ తిరస్కారం భరించ టమే తేలికేమో!

అందుకోసమయినా ఇంట్లోనే ఉండు. ఎక్కడికీ వెళ్ళిపోకు.

మన స్నేహం.... ఒకప్పటి తియ్యని కలగా చెదిరిపోతోందని గిలగిలలాడుతున్న నాకు....కళ్ళ క్కనిపించి మనళ్ళాంతి దక్కించు!

ఆయనతో నీకు పరిచయమై ఏడాది కావస్తోంది. నువ్వెప్పుడూ ఆయన ఫోటో అయినా పంపలేదు! మా పెళ్లిచూపులయి....సంబంధం స్థిరపడ్డ వెంటనే నీ కాయన ఫోటో పంపాను. పెళ్ళయాక మా జంట ఫోటో కూడా పంపాను. నే నాశించి నంత "రెస్పాన్సు" నీనుంచి రాలేదు. అడక్కుండా నే మా ఫోటోలు నేను పంపిస్తే— అడిగినా మీ ఫోటోలు నువ్వు పంప లేదు.

మీ కాబోయే శ్రీవారంత.... విశాలహృదయుడు కాకపోవచ్చు. నా భర్తా ఆదర్శవంతుడే! అది నువ్వు గుర్తించకపోయినా నా మనస్సుకి తెల్సు!

అది చెప్పటాని క్కాకపోయినా

....నువ్వు కళ్ళతోచూపి తెల్పు కుంటావని ఆశిస్తున్నాను. అందుకే వస్తున్నాను....

* *

అంతవరకు వ్రాపి ఆగాను. వ్రాపినంతవరకు మళ్ళీ చదివాను. అలా వ్రాసుకున్నాక గుండెల్లో గుబులు తగ్గినట్లనిపించింది.

ఇంతలో శ్రీవారు ఆఫీసునుండి వచ్చారు. మంచినీళ్ల తెచ్చిచ్చాను!

"....అబ్బో! ఎవరికో పేజీలు పేజీలు వ్రాసేస్తున్నావు!"

"ఇంకెవరికి? ఆ పాషాణానికి ....ఇది చదివాక కరుగుతుందేమో నని!" అన్నాను కోపంగా

"అదేమిటి?...."

"....అ దే న ం డీ బా బూ! రేణూకి...."

ఆయన ముఖం మీద నవ్వు మాయమైంచి.

"చదవండి!"

"అబ్బే. ఎందుకూ!"

"ఫర్వాలేదు. మోతాదు పెరి గిందో తరిగిందో తెల్పుకుందామని. ఆ రాతి హృదయాన్ని కరిగిస్తుందో లేదో చదివి చెప్పండి?" అని ఆయన చేతిలో ఆ ఉత్తరం పెట్టి టిఫిను తీసుకురావటానికి వెళ్ళాను.

నేను వచ్చేసరికి ఆయనింకా చదువుతూనే ఉన్నారు. ఆయన ముఖంలోని భావాలు చదవగలిగే శక్తి నాకు లేకపోయింది. కాని .... ఎందుకో ముఖం కళతప్పినట్లుగా ఉంది. నల్లబడిపోయింది. మా ఆరునెలల వైవాహిక జీవితంలో ఎప్పుడూ జరగలేదు!

ఆయన ఉత్తరం చదివి టేబులు మీద పడేశారు. నా ముఖంలోకి ఒకసారిచూపి తల త్రిప్పుకున్నారు.

"టిఫిను తినండి!"

ఆయన ప్లేటు అందుకోలేదు.

"ఏమిటాలోచిస్తున్నారు? ఉత్త రము గురించేనా?"

"అవును. ఉహూ! కాదు.... మనం పండక్కి వెళ్ళటంగురించి!"

"ఇంకా ఆలోచనకేముంది? ఎల్లుండి ప్రయాణం పెట్టుకొని!"

"ఉహూ? మరోసారి వెడదాం! ఇప్పుడొద్దు."

"ఉన్నట్టుండి ఇదేం మాట! మనమొస్తామని మా వాళ్ళెంతో ఎదురు చూస్తుంటారు - మొదటి పండగని."

"పండగ అదీ అంటే బట్టలు పెడతారు...." ఆయన నవ్వులో ఎక్కడా జీవం లేదు. ఆ మాట అన్న తీరులో ఏదో దాచుకుంటున్న భావం ఉంది.

....పుచ్చుకోవడం ఇష్టం లేక పోతే మానేద్దాం. అయినా మనం వెడుతున్నది దానికోసం కాదు.... పండగనీ, సరదాకనీ. ఆ పెట్టేది ఎప్పుడు పెట్టినా పెడతారు. వద్దను కుంటే, ఎప్పుడయినా రెఫ్యూజ్

చెయ్యొచ్చు!"

"అదికాదు...."

"....ఏదీ కాదు. నన్ను నిరుత్సాహ పరచాలని మీకెలా అనిపిస్తోంది? ముఖ్యంగా .... తిరుగు ప్రయాణంలో రేణూని చూడాలని ....నా ఉద్దేశ్యం! అందుకనే ఈ ఉత్తరం...."

ఆయన మాట్లాడలేదు.

నా మనస్సు చివుక్కుమంది. "పోన్లెండి! మీ కిష్టం లేకపోతే మానేద్దాము."

అప్పటికీ ఆయన మౌనమే!

"....మనల్ని చూడాలని దానికీ లేదు. నా కోరిక తీర్చాలని మీకూ లేదు. ఇంకీ ఉత్తరం ఎందుకు? చింపేస్తాను...." అని చేతిలోకి తీసుకొని చింపబోయాను.

నా బెదిరింపు ఆయన మీదేం పని చేసినట్టు లేదు. ఒక్కసారి చూపి తల త్రిప్పుకున్నారు. నాకు ఒళ్ళు మండిపోయింది ....చటుక్కున ఆ ఉత్తరం ముక్కలు ముక్కలుగా చింపేసి నేలకేసి కొట్టాను.

అప్పటికీ ఆయనలో చలనం లేదు. ప్రతిమలా కూర్చుండి పోయారు.

నాకు ఉక్రోషంతో కళ్ళ నీళ్ళొచ్చాయి. "....ఈ మాట ప్రొద్దున్నే చెప్పకపోయారా? గంటసేపు కూర్చుని ఈ ఉత్తరం వ్రాసే బాధ నాకు తప్పేది!

"నన్ను క్షమించు!...."

విభ్రాంత పోయాను. ఆయన గొంతులోని వణుకు....ఆ మాట అన్న తీరు చిత్రంగా ఉన్నాయి.

"నీనుంచి ఇంకే విషయం దాచి ప్రయోజనం లేదు"

"ఏమిటీ?"

"మీ రేణూ విషయం!"

ఆశ్చర్యపోయాను, నాకు తెలియని "రేణూ" విషయం ఆయనకేం తెల్సు?

"....మీ రేణూ గతంలోమాదిరి నీకెందుకు ఉత్తరాలు వ్రాయటం లేదో నాకు తెల్సు!"

కళ్ళప్పగించి చూసాను, గొంతు పెగల్లేదు.

"....క్షమించు."

"మళ్ళీ అదేమాట! చెప్పండి. మాటి మాటికీ మీరెందుకలా అంటారు? నాకు తెలియనిది- మీకు తెల్సింది ఏమిటో అదిచెప్పండి!" అన్నాను ఆయన చేతులు పట్టుకుంటూ.

ఓ నిమిషం ఆగి ఆయన చెప్పారు "మీ రేణు నీకు సంతోషంగా సరదాగా ఉత్తరాలు వ్రాయకపోవటానికి కారణం....ఆమెను పెళ్ళాడతానన్న ఆ మనిషి తన ఆదర్శాన్ని నిలబెట్టుకోకపోవటం మూలానే! ఆమె జీవితంనుంచే కాదు- ఆ ఉద్యోగం వదులుకొని

ఆ బ్యాంకునుంచే అతను వెళ్ళి పోయాడు!"

నాకు మతిపోయినట్లయింది. "అయ్యో! ఎంతపని జరిగింది! ఈ సంగతి రేణూ నాకెప్పుడూ వ్రాయలేదు. అది వ్రాయందే నాకెలా తెలుస్తుంది? నాకు తెలియకుండా రేణూని ఎన్నిమాటలన్నాను? నిజం తెల్సుకోకుండా ఎంత నిందించాను?" నాకు ఏడుపు వచ్చినంత పనయింది. దుఃఖం దిగమ్రింగుకుంటూ అడిగాను .... "అంటే అతనూ భయంతోనే వదలి వెళ్ళిపోయాడా!"

ఆయన తలవూపారేకాని పెదవి కదపలేదు,

ఉవ్వెత్తున పొంగిన ఉద్వేగంతో గుండె దడదడ లాడింది. ఆలోచనలతో బుర్ర వేడెక్కిపోయింది. ఒక్కసారిగా "రేణు" వద్దకి పరిగెత్తి పోవా లనిపించింది. దాన్ని నా కౌగిట్లోకి తీసుకొని ఓదార్చాలని మనస్సాగిపోయింది. "ఇలా జరిగిందని తెలిసాకయినా మనం తప్పకుండా వెళ్ళాలి. దాన్ని కలవాలి. ఓదార్చాలి. అది మన ధర్మం.... స్నేహితురాలిగా నా ధర్మం?"

ఆయన అస్తవ్యస్తంగా తల వూపారు. ఏమిటాయన ఉద్దేశ్యం! అప్పుడే నా బుర్రలోకి కత్తిలా ఒక ప్రశ్న దూసుకు వచ్చింది. నాకింతకాలం తెలియని ఈ సంగతి ఆయనకెలా తెల్సింది? అదేమాట అడిగాను. ".... అతను కావి. మీక్కనిపించాడా?"

నాకు కోపంముంచు కొచ్చింది. "అడక్కపోయారా...." కబుర్లు చెప్పటంకాదు.ఆదర్శాలన్నవి ఆచరణలో పెట్టాలని- అప్పుడే అవి ఆదర్శాలనిపించు కుంటాయని బుద్ధిచెప్పక పోయారా!"

ఆయన మాట్లాడలేదు. నా వైపే కళ్ళప్పగించి చూసారు.

"ఏమంటాడు? ఏ చెల్లెలో పెళ్ళి కెదిగి వచ్చింది, తాను రేణూని పెళ్లాడితే ఆ పిల్లకి పెళ్ళికాదేమోనని భయపడుతున్నానంటాడు అంతేనా" అన్నాను వెటకారంగా.

ఆయన ముఖం ఎందుకో తెల్లగా పాలిపోయింది.

"ఏమిటలా అయిపోయారు?" అన్నాను చెయ్యిపట్టుకొని.

"ఆ చెల్లెలెవరోకాదు....మీఅడపడుచే?"

ఉలిక్కిపడ్డాను. "ఏమిటి మీరనేది?"

ఆయన తలదించుకున్నా.... ఆ కళ్ళల్లోకి చిందిన నీళ్లు నాకు కనిపించాయి".... ఆ ఆదర్శం నిలబెట్టుకోలేక పోయిన పిరికి మాధవరావుని నేనే! మీ రేణూని పెళ్ళాడటానికి భయపడి పారిపోయిన దౌర్భాగ్యుణ్ణి నేనే?" *